సాక్షి
శ్రీకాకుళం

శుక్రవారం । 24 । జనవరి । 2025

న్యూస్‌రీల్

'ఉత్తమ' అవార్డులకు ఎంపికలు

శ్రీకాకుళం పాతబస్టాండ్: రెండు రోజుల్లో భారత గణతంత్ర దినోత్సవం రానుంది. ఎప్పటిలాగానే ఈ ఏడాది కూడా జిల్లాలో వివిధ శాఖల్లో పనిచేసిన ఉత్తమ ఉద్యోగులకు అవార్డులు ప్రదానం చేయనున్నారు. దీనికోసం అధికార యంత్రాంగం చర్యలు చేపట్టింది. అయితే ఈ సారి అవార్డుల సంఖ్య గణనీయంగా తగ్గించాలని కలెక్టర్, జేసీలు నిర్ణయించుకొన్నారు. కేవలం ఉత్తమ సేవలు అందించిన కొద్ది మందికి ఈ అవార్డులు ఇవ్వడం ద్వారా వారికి గుర్తింపు ఉంటుందని భావిస్తున్నారు. ఈ ఏడాది వంద కంటే తక్కువ మందికే అవార్డులు ప్రదానం చేయనున్నారు. ఇప్పటి వరకు జిల్లాలో 36 ప్రభుత్వ శాఖల నుంచి 100 మంది వరకు పేర్లు ఉన్నతాధికారులు సిఫార్సు చేశారు. మరో 30 శాఖల నుంచి పేర్లు రానున్నాయి. వీరంతా అవార్డులకు అర్హులా కాదా అన్న విషయాలపై పూర్తిస్థాయిలో విచారణ చేస్తున్నారు. జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ ఆధ్వర్యంలో శాఖల వారీ గా ఉద్యోగులతో ఆయన మాట్లాడుతున్నారు. జాబితా ఈనెల 25 తేదీ నాటికి రానుంది.

మార్చి నాటికి ఆస్పత్రుల నిర్మాణాలు పూర్తి



నరసన్నపేట ఆస్పత్రిలో భవనాలను పరిశీలిస్తున్న ఎస్‌ఈ తదితరులు

నరసన్నపేట: నాబార్డు నిధులతో నిర్మిస్తున్న ప్రభుత్వ ఆస్పత్రుల భవనాలు మార్చి నాటికి పూర్తి చేస్తామని ఏపీఎంఎస్ఐడీసీ ఎస్‌ఈ విజయభాస్కర్ గుప్త అన్నారు. నరసన్నపేట, రాజాం, సీతంపేటలో భవనాలు నిర్మాణంలో ఉన్నాయన్నారు. స్థానిక ఏరియా ఆస్పత్రిలో నిర్మాణ పనులను ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా పనుల్లో జాప్యంపై ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. నిధులు ఇచ్చినా కూడా పనులు చేయకపోవడంపై కాంట్రాక్టర్ ప్రతినిధిని నిలదీశారు. ఎట్టి పరిస్థితుల్లో పనులు మార్చి కల్లా పూర్తి చేయాలని ఆదేశించారు. నరసన్నపేట ఆస్పత్రిలో నిర్మాణాలు సాగుతుండటంతో రోగులు పడుతున్న ఇబ్బందులను సూపరింటెండెంట్ శ్రీనుబాబు, ఏఓ రమణమూర్తిలు ఎస్‌ఈ దృష్టికి తీసుకువెళ్లారు. వీటన్నింటినీ ఎస్‌ఈ పరిశీలించారు. ప్రహరీతో పాటు సివిల్ వర్క్ కారణంగా ధ్వంసమైన పైపులను బాగు చేయాలన్నారు. ఆయన వెంట ఈఈ సత్యప్రభాకర్, డీఈ శిమ్మన్న తదితరులు ఉన్నారు.

ఏసీబీ కార్యాలయానికి జిల్లా బీసీ సంక్షేమాధికారి..?

శ్రీకాకుళం పాతబస్టాండ్/శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా వెనుకబడిన సంక్షేమ శాఖ అధికారి, ఆమె కార్యాలయంలో కొన్ని నెలలుగా జరుగుతున్న అవినీతిపై ఏసీబీ అధికారులు రెండు రోజుల పాటు దర్యాప్తు చేపట్టారు. అయితే ఈ విచారణకు సంబంధించి వివరాలు చెప్పేందుకు ఏసీబీ అధికారులు నిరాకరించారు. ఇందులో భాగంగా బుధవారం కొంతమంది వసతి గృహ సంక్షేమ అధికారులను కార్యాలయానికి పిలిపించుకుని శాఖలో జరుగుతున్న, అధికారిణిపై వస్తున్న అవినీతి ఆరోపణలపై ఆరా తీసినట్లు సమాచారం. గురువారం వసతి గృహ వార్డెన్, మరికొంతమందిని పిలిచి విచారణ చేశారు. బీసీ సంక్షేమ శాఖాధికారిణి సైతం ఈ విచారణకు హాజరైనట్లు తెలుస్తోంది.

విచారణకు ప్రధాన కారణం..

గత ఏడాది సెప్టెంబరులో జిల్లా బీసీ సంక్షేమ అధికారిణి అవినీతిపై ఆరోపణలు చేస్తూ ఏపీ బీసీ వెల్ఫేర్ డైరెక్టర్‌కు ఓ ఫిర్యాదు వెళ్లింది. దానిపై కూలంకషంగా సంబంధిత శాఖ తరఫున విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలంటూ గత ఏడాది అక్టోబరులో కలెక్టర్‌కు ఎండార్స్ చేస్తూ బీసీ వెల్ఫేర్ డైరెక్టర్ నుంచి ఉత్తర్వులు వచ్చాయి. ఇదే విషయం ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి వద్ద ప్రస్తావించగా కొన్ని పిటీషన్లు తమ పరిశీలనకు వస్తుంటాయని, ఫార్మల్ ఎంక్వైరీ చేస్తుంటామని, బీసీ వెల్ఫేర్ శాఖ నుంచి కొంతమందిని ఆ విధంగానే పిలిచామని, అలాగని ఈ అంశంపై ఎలాంటి కేసు లేదని అన్నారు. అధికారిణి కార్యాలయానికి రావడం అవాస్తవమని చెప్పారు.

క్రిటికల్ థర్మల్ పవర్ ప్లాంట్‌కు స్థల పరిశీలన

బూర్జ: మండలంలో గల మదనాపురం పరిసర గ్రామ రెవెన్యూ పరిధిలో గురువారం ఏపీ జెన్‌కో ఆధ్వర్యంలో చీఫ్ ఇంజినీర్ల కమిటీ పర్యటించి క్రిటికల్ థర్మల్ పవర్ ప్లాంట్ స్థాపనకు స్థల పరిశీలన చేసింది. ప్లాంట్ స్థాపనకు గల భూ పరిస్థితులు, వాతావరణం అనుకూలతలను అధ్యయనం చేయడానికి కమిటీ పర్యటించింది. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ, ఏపీ మార్క్ ఫెడ్ డైరెక్టర్ ఆనెపు రామకృష్ణనాయుడు, సరుబుజ్జిలి టీడీపీ నాయకులు శివ్వాల సూర్యనారాయణ, అంబాల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఓయ్..! మిమ్మల్నే..





జి.సిగడాం: ఆగి ఉన్న రైలు కిందికి దూరి చిన్నారితో సహా పట్టాలను దాటుతూ...

రైలు పట్టాలపై నిత్యం ఎక్కడో ఓ చోట ప్రమాదాలు జరుగుతున్నాయి. అయినా పలు చోట్ల ప్రమాదకర ఫీట్లు చేయడం జనాలు ఆపడం లేదు. రైలు పట్టాలు దాటడం చట్టరీత్యా నేరం. రైల్వే ఓవర్ బ్రిడ్జి, సబ్‌వేలు ఉపయోగించి మాత్రమే పట్టాలు దాటాల్సి ఉంటుంది. కానీ రైల్వేస్టేషన్లలో ట్రైన్లు వస్తుండగానే చాలా మంది పట్టాలు దాటుతూ ప్రమాదాలను కొని తెచ్చుకుంటున్నారు. మరికొందరైతే రైల్వే గేట్ వేసి ఉన్నా పట్టించుకోకుండా ప్రమాదకరంగా ప్రయాణం చేస్తున్నారు. ఇకనైనా నిబంధనలు పాటించాలని రైల్వే అధికారులు కోరుతున్నారు.

– సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం



కంచిలి: సోంపేట రైల్వేస్టేషన్‌లో ఒకటో ప్లాట్‌ఫాం నుంచి ప్రమాదకరంగా పట్టాలను దాటుతున్న ప్రయాణికులు

దయచేసి దాటొద్దు..



జిల్లాలో రైలు ప్రయాణికులకు, పరిసర ప్రాంతీయులకు విన్నవించి.. విడమర్చి చెబుతున్నాం. రైలు పట్టాలు దాటడం నేరం కిందకు వస్తుంది. పాదచారులు, పరిసర గ్రామ ప్రజలు కాలినడకన రైల్వే ఓవర్ బ్రిడ్జ్ లేదా సబ్ వే ఉపయోగించాలి. రైల్వే చట్టాలు అందరికీ వర్తిస్తాయి. ప్రజలంతా నియమ నిబంధనలు పాటించాలని కోరుకుంటున్నాము.

– మలయాద్రి, ఎస్‌ఐ, ఆర్పీఎఫ్, పలాస రైల్వేస్టేషన్



కాశీబుగ్గ: రైలు పట్టాలు దాటుతున్న ప్రయాణికులు

ఉల్లంఘనుల పని పట్టాల్సిందే

• రైలు గేటు నిబంధనలు ఉల్లంఘిస్తే..

రైల్వే గేటు వేసినప్పుడు దాటుకుంటూ, కిందనుంచి దూరి వెళ్లిన వారికి భారతీయ రైల్వే చట్టం ప్రకారం సెక్షన్ 160 ద్వారా మూడు నుంచి 5 సంవత్సరాలు జైలు శిక్ష విధిస్తామని అధికారులు చెబుతున్నారు.

• పట్టాలు దాటితే..

భారతీయ రైల్వే నియమావళి 147 ప్రకారం రైలు పట్టాలు దాటడం నేరం.

ఈ అతిక్రమణకు 6 నెలలు జైలు శిక్ష, రూ.1000లు జరిమానా విధిస్తారు.



ఆమదాలవలస: శ్రీకాకుళం రోడ్ రైల్వేస్టేషన్ పరిధి ఊసవానిపేట గేటు వద్ద గేటు మూసిన తర్వాత కింద నుంచి దూరి వెళ్తున్న ద్విచక్ర వాహనదారుడు



కాశీబుగ్గ: ఎల్‌సీ గేటు వద్ద గేటు కింద నుంచి వెళ్తున్న ద్విచక్ర వాహనదారులు





నాట్ గుడ్

ఈ దృశ్యాలు టెక్కలి మండలం నౌపడ రైల్వేస్టేషన్ సమీపంలోనివి. తలగాం(నౌపడ ఆర్‌ఎస్) ప్రభుత్వ పాఠశాలకు రావాల్సిన గుడ్లను సంబంధిత ఏజెన్సీ సిబ్బంది చేరవేయాల్సి ఉండగా పాఠశాలకు కొంత దూరంలో దింపేస్తున్నారు. దీంతో విద్యార్థులు ప్రమాదకరంగా గుడ్లను రైల్వే పట్టాలు దాటి ఇలా తీసుకెళ్తున్నారు. ఉపాధ్యాయులు దగ్గరుండి విద్యార్థులతో ఇలా చేయించడం విమర్శలకు తావిస్తోంది.

- టెక్కలి రూరల్

రహదారి భద్రతా నియమాలు పాటించాలి



కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం పాతబస్టాండ్ : వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ రహదారి భద్రత నియమాలు పాటించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పిలుపునిచ్చారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రవాణాశాఖ ఆధ్వర్యంలో 36వ జాతీయ రహదారుల భద్రతా మాసోత్సవాలు, జిల్లా రహదారుల భద్రతా సమన్వయ కమిటీ సమావేశాన్ని కలెక్టర్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ రోడ్డు భద్రతా చర్యలపై ఆంక్షలను మరింత కఠినతరం చేయాలని, మార్కింగ్, సైన్ బోర్డులు పెద్ద అక్షరాలుండేలా చూడాలని, అవసరమైన చోట స్పీడ్‌బ్రేకర్లు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. వాహనదారులు మద్యం సేవించి వాహనాలు నడపరాదని, ర్యాష్ డ్రైవింగ్ చేయరాదని, సిగ్నల్ జంపింగ్ నేరమని, కార్‌డ్రైవింగ్ చేసేవారు సీట్‌బెల్టు పెట్టుకోవాలని, పరిమితికి మించి విద్యార్థులను వాహనంలో ఎక్కించరాదని, ద్విచక్రవాహనదారులు హెల్మెట్లు ధరించాలని అన్నారు. సమావేశంలో ఉప రవాణాకమీషనర్ విజయసారధి, అదనపు ఎస్పీ కేవీ రమణ, డీఎస్పీ వివేకానంద,ఆర్అండ్‌బీ ఎస్‌ఈ జాన్‌సుధకర్ పాల్గొన్నారు.

యురేకా సైన్స్ ఎక్స్‌పై అవగాహన

శ్రీకాకుళం: జన విజ్ఞాన వేదిక జిల్లా కమిటీ ఆధ్వర్యంలో అధ్యయన యాత్రలో భాగంగా 7 మండలాల్లో గురువారం వివిధ పాఠశాలను సందర్శించినట్లు రాష్ట్ర కార్యదర్శి గొంటి గిరిధర్, జిల్లా అధ్యక్షుడు కుప్పిలి కామేశ్వరరావులు తెలిపారు. ఈ సందర్భంగా గిరిధర్ మాట్లాడుతూ ఉత్తరాంధ్ర అధ్యయన యాత్రలో భాగంగా జిల్లాలోని నరసన్నపేట, కోటబొమ్మాళి, టెక్కలి, నందిగామ, కాశీబుగ్గ, మందస, సోంపేట, హరిపురంలోని ప్రభుత్వ పాఠశాలలను సందర్శించి పర్యావరణం, యురే కా సైన్స్ ఎక్స్‌పో, విద్య, ఆరోగ్యం అంశాలపై చైతన్యవంతం చేసినట్లు తెలిపారు.

● ఎగసిపడ్డ జీవధార



హిరమండలం నుంచి ఇచ్ఛాపురం వరకు 105 కిలోమీటర్లు ప్రవహించే ఉద్దానం తాగునీటి ప్రాజెక్టుకు చెందిన మెగా పైపులైన్ లీకైంది. పలాస మండలం రేగులపాడు గ్రామానికి సమీపంలో పైపులైన్ జంక్షన్ వద్ద హై ప్రెజర్‌తో పైపులైన్ జంక్షన్ వద్ద పైన ఉండే చక్రం విరిగి జలధార ఆకాశానికి ఎగసిపడింది. దీంతో ఉద్దాన ప్రాంతానికి అందాల్సిన తాగునీరు నిలిచిపోయింది. గురువారం ఉదయం 11.30 గంటలకు లీకైన పైపులైన్ మధ్యాహ్నం 1.30 వరకు కొనసాగింది. లీకైన నీటి ప్రవాహం కిలోమీటరు దూరం వరకు చుట్టుపక్కల కనిపించడంతో స్థానికులు చేరుకుని సెల్ఫీలు దిగారు. అనంతరం అధికారులకు సమాచారం అందడంతో సరఫరా నిలుపుదల చేశారు. గత ప్రభుత్వంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రూ.700 కోట్ల వ్యయంతో దీని నిర్మాణం చేపట్టి ప్రారంభించారు.

- కాశీబుగ్గ

కూర ఏదైనా కిలో రూపాయేనట..

ఇదెలా సాధ్యం..?

- రూపాయికే కిలో కూరగాయలు సరఫరా
- 29 రకాల్లో 20 రకాలను రూపాయికే సరఫరా చేస్తామని టెండర్లలో పాల్గొన్న వెండర్
- అతి తక్కువ కోట్ చేశారని 34మందిలో ఒకరిని ఖరారు చేసిన జిల్లా కమిటీ
- మార్కెట్‌లో కిలో కూరగాయలు ధరలు సరాసరి రూ. 50కి పైగా పలుకుతున్న పరిస్థితి
- కేజీబీవీ, మోడల్ స్కూల్స్‌కు కిలో రూపాయికే సరఫరా చేసే కాంట్రాక్ట్ ఖరారు



సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

కిలో అల్లం రూపాయి, కిలో కాలీ ఫ్లవర్ రూపాయి, కిలో క్యారెట్ రూపాయి, కిలో పొడవు చిక్కుడు రూపాయి, కిలో నిమ్మకాయ రూపాయి, కిలో పచ్చి మిరప కాయ రూపాయి.. ఇలా ఎన్నో. ఇవేవీ షాపింగ్ మాల్స్‌లో పెట్టిన ఆఫర్లు కావు. రైతు బజారు ధరలు అంతకన్నా కావు. జిల్లాలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలకు(కేజీబీవీ), ఏపీ మోడల్స్ స్కూల్స్‌కు సరఫరా చేస్తామని ముందుకొచ్చిన వెండర్ కోట్ చేసిన ధరలివి. చూడటానికే కాదు వినడానికి కూడా ఆశ్చర్యంగా ఉంది. కానీ ఇదే నిజం.

జిల్లా పర్చేజింగ్ కమిటీ పిలిచిన టెండర్లలో వివిధ వెండర్లు తమకు తోచిన విధంగా కోట్ చేయగా అందులో అతి తక్కువ కోట్ చేసిన వెండర్‌కు జిల్లా జాయింట్ కలెక్టర్ చైర్మన్‌గా ఉన్న కమిటీ ఈ కూరగాయలు సరఫరా చేసే కాంట్రాక్ట్‌ను ఖరారు చేసింది. ఈ ప్రహసనమంతా డిసెంబర్‌లో జరిగింది. కొత్త సంవత్సరం ప్రారంభం నుంచి అమల్లోకి కూడా వచ్చింది. కేజీబీవీ, మోడల్స్ స్కూల్స్‌ను పర్యవేక్షిస్తున్న సర్వశిక్షా అభియాన్ శాఖ ఆధ్వర్యంలో ఇదంతా జరిగింది. పాత ఏపీసీ తిరుమల చైతన్య నేతృత్వంలో టెండర్ల ఆహ్వానం, తెరవడం జరగగా కొత్తగా బాధ్యతలు స్వీకరించిన ఏపీసీ సంపతిరావు శశిభూషణ్ వచ్చేసరికి ఖరారు చేసి ఉంచిన కాంట్రాక్ట్‌పై సంతకం పెట్టారు.



ఇది సాధ్యమేనా..?

- జిల్లాలో 25 కేజీబీవీ, 13 మోడల్ స్కూల్స్‌లో ఉన్న 7790 మంది విద్యార్థులకు ప్రతిరోజూ భోజనం పెట్టేందుకు అవసరమైన కూరగాయలకు సంబంధించి డిసెంబర్ మొదటి వారంలో కాంట్రాక్ట్‌కు సంబంధించిన టెండర్లను పిలిచారు.
- మూడో వారంలో ఆ టెండర్లలో పాల్గొన్న వెండర్ల షెడ్యూళ్లను తెరిచారు. దీంట్లో 34 మంది వెండర్స్ పాల్గొన్నారు. వీరిలో ఒకరు ప్రస్తుతం ఖరారు చేసిన వెండర్ కంటే తక్కువగా కోట్ చేశారు. కాకపోతే, ఒప్పందానికి వచ్చేసరికి అన్‌విల్లింగ్ ఇచ్చేశారు.
- ఆయన తర్వాత తక్కువ కోట్ చేసిన వెండర్‌కి టెండర్‌ను ఖరారు చేశారు. అయితే ఈ ధరకు కూరగాయలు ఇవ్వడం సాధ్యమేనా? భవిష్యత్‌లో సరఫరా చేయగలరా? అన్న అనుమానం వ్యక్తమవుతోంది.
- దీని బదులు మార్కెట్‌లో ఉన్న రేట్ల ప్రకారం సరాసరిగా తీసుకుని ఒక నిర్దేశిత ధర పెట్టి, దానిపైన తక్కువో...ఎక్కువో కోట్ చేసి టెండర్లలో పాల్గొనండి అని పేర్కొని ఉంటే బాగుండేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.
- కిలో రూపాయి అనేది అత్యల్పమని, విద్యార్థులకు పెట్టే భోజనానికి నాణ్యమైన కూరగాయలు అందించే అవకాశం ఉందా? అనే సందేహాలకు తాజాగా ఖరారైన కాంట్రాక్ట్ తావిస్తోంది.

20 రకాలు కిలో రూపాయికే సరఫరా..

మార్కెట్‌లో కిలో కూరగాయలు దాదాపు రూ.40 నుంచి రూ.60కి పైగానే ఉన్నాయి. పైన కాంట్రాక్ట్‌లో పేర్కొన్న సరుకుల ధరలు కూడా దాదాపు అలాగే ఉన్నాయి. కానీ కిలో సరుకును రూపాయికే సరఫరా చేస్తామని వెండర్ ముందుకు రావడం గ్రేటే. ఆయనే కాదు టెండర్లలో ఆయన తర్వాత కోట్ చేసిన వారిలో చాలామంది రూపాయి తేడాతోనే కోట్ చేశారు. 29 రకాల వెజిటబుల్స్(కూరగాయల)కు టెండర్లు పిలవగా అందులో 20 రకాలకు కిలో రూపాయికే సరఫరా చేస్తామని వెండర్ ముందుకొచ్చారు. మరో రకం కిలో రెండు రూపాయలకు, మిగతా ఎనిమిది రకాలకు పదుల సంఖ్యలో ఉన్న ధరలకు కోట్ చేసి సదరు వెండర్ కాంట్రాక్ట్ దక్కించుకున్నారు.

తేడా వస్తే చర్యలు తీసుకుంటాం..

ఇదే విషయమై ప్రస్తుత సర్వ శిక్షా అభియాన్ ఏపీసీ సంపతిరావు శశిభూషణ్ వివరణ కోరగా తాను బాధ్యతలు స్వీకరించే సరికే టెండర్ల ప్రక్రియ పూర్తయ్యిందని, నిబంధనల ప్రకారంగా అంతా జరిగిందని, భవిష్యత్‌లో ఎలాంటి తేడాలు లేకుండా చూసుకోవాల్సిన బాధ్యత తమపై ఉందని తెలిపారు. తేడా వస్తే వార్నింగ్‌లిచ్చి, అవసరమైతే బిల్లులో దశల వారీగా తగ్గించి ఇచ్చే అధికారం తమకుందని చెప్పారు. టెండర్లు ఖరారు చేసినప్పుడు సర్వశిక్షా అభియాన్ ఏపీసీగా పనిచేసిన తిరుమల చైతన్యను వివరణ కోరగా జేసీ ఆధ్వర్యంలో ఖరారు చేశారని, లీగల్‌గా తక్కువ కోట్ చేసిన వారికే ఖరారు చేయాల్సి ఉందని, నెల రోజులు చూసి ఏమైనా తేడా ఉంటే చర్యలు తీసుకోవచ్చని జేసీ సూచించినట్టుగా తిరుమల చైతన్య తెలిపారు.

● మానవ జన్మకు సార్థకత ఉండాలి

మానవ జన్మకు తగిన సార్థకత ఉండాలని మైసూర్ దత్తపీఠాధిపతి గణపతి సచ్చిదానంద స్వామీజీ అన్నారు. శ్రీకాకుళంలోని చిం దత్తనాథ క్షేత్రానికి ఆయన గురువారం వచ్చి అనుగ్రహ భాషణం చేశారు. మనలో చెడు చింతన ఉండకూడదని, మిత్రత్వంతో మెలగాలని, ప్రాణిహింస చేయడం మంచిది కాదని ప్రబోధించారు. మనలోని అరిషడ్వర్గాలను అదుపు చేసేది హనుమంతుడని, అందుకే కొత్తగా నిర్మించిన ఈ ప్రాంగణానికి హనుమ భవనం అని నామకరణ చేస్తున్నానని ప్రకటించారు. దత్తపీఠం ఉత్తరాధికారి విజయానంద తీర్థ శ్రీచక్రార్చన, గణపతి హోమం పూర్ణాహుతి చేశారు. అలాగే స్వామీజీ నూతన భవనాలను ప్రారంభించారు.

– శ్రీకాకుళం కల్చరల్



గణపతి సచ్చిదానంద స్వామీజీ

క్లుప్తంగా

పండ్ల వ్యాపారి ఇంట్లో బంగారం చోరీ



వివరాలు సేకరిస్తున్న క్లూస్ టీం, సీఐ పైడపునాయుడు

గార: రోడ్డుపై పండ్ల వ్యాపారం కోసం వెళ్లిన కుటుంబ సభ్యులు రాత్రి తిరిగి ఇంటికి వచ్చేసరికి వెనుక తలుపులు తెరిచే ఉన్నాయి. అనుమానం వచ్చి బీరువా తీసేందుకు తాళాల కోసం వెతకగా దొరకలేదు. విరగ్గొట్టి చూస్తే బంగారం మాయమైంది. శాలిహుండం ఎస్సీ కాలనీలో ఈ చోరీ చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శాలిహుండంకు చెందిన ఉరజాన రమణమ్మ, ఆదినారాయణ దంపతులు రోడ్డుపై పండ్ల వ్యాపారం చేస్తుంటారు. ఎప్పట్లాగే భైరి, సింగుపురం ఫ్లై ఓవర్ కింద పండ్ల వ్యాపారం ముగించుకొని బుధవారం రాత్రి ఇంటికి చేరుకున్నారు. ఇంటి తలుపు తీసి చూసేసరికి వెనుక తలుపు తెరిచి ఉంది. తాము వేయలేదని భావించి.. తర్వాత తన మెడలో ఉన్న హారం బీరువాలో పెడదామని చూశారు. తాళం లేకపోవడంతో బీరువాను పగలగొట్టి చూసేసరికి అప్పటికే బంగారం లేకపోవడంతో పోలీసులుకు ఫిర్యాదు చేశారు. గురువారం ఉదయం క్లూస్‌టీం, సీఐ పైడపునాయుడు, ఎస్ఐ రెల్ల జనార్ధనరావులు ఘటనా స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. కుటుంబ సభ్యులతో పాటు పొరుగింటి వారిని కూడా పోలీసులు తీసుకెళ్లి విచారణ చేపట్టారు. ఉదయం 50 తులాలు బంగారం అన్న ఫిర్యాదు.. సాయంత్రమయ్యేసరికి 14.5 తులాలు మాత్రమే పోయినట్టు కేసు నమోదు జరిగింది. కుటుంబ కలహాలు కూడా చోరీకి కారణమై ఉండవచ్చని గ్రామస్తులు చెబుతున్నారు. కాగా, వాస్తవంగా 9.5 తులాలు మాత్రమే పోయిందని, ఆ దిశగా దర్యాప్తు కొనసాగుతుందని పోలీసులు చెబుతున్నారు.

ఆస్పత్రిలో దొంగతనం

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లాకేంద్రంలోని ఇలిసిపురం జంక్షన్ బొందిలీపురం వెళ్లే రోడ్డులో మంచు ఐ కేర్ ఆస్పత్రిలో చోరీ జరిగినట్లు రెండో పట్టణ సీఐ పి.ఈశ్వరరావు తెలిపారు. బుధవారం రాత్రి తలుపులు విరగ్గొట్టి గుర్తు తెలియని వ్యక్తులు లోపలకు చొరబడ్డారని, క్యాబిన్ డెస్క్‌లో ఉన్న రూ.లక్ష నగదు, హార్డ్ డిస్క్ పట్టుకుపోయినట్లు ఆస్పత్రి ఎండీ డాక్టర్ వాసుదేవరావు గురువారం ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

నాటుతుపాకీ స్వాధీనం



పోలీసులు స్వాధీనం చేసుకున్న నాటు తుపాకీ

మెళియాపుట్టి: మండలంలోని భరణికోట పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో ఇద్దరు వ్యక్తులు నాటు తుపాకీతో సంచరిస్తున్నట్లుగా సమాచారం అందుకున్న పోలీసులు దర్యాప్తు చేసి ఇద్దరిని బుధవారం రాత్రి అరెస్ట్ చేశారు. కోధు కొళిగాం గ్రామానికి చెందిన కోరాడ గిరి, పలాస మండలం లొత్తూరు గ్రామానికి చెందిన భుజంగరావు (అలియాస్ రాజు)ను గురువారం కోర్టులో హాజరు పరచి పాతపట్నం సబ్ జైలుకు తరలించినట్లు ఎస్సై రమేష్‌బాబు తెలిపారు. తుపాకీని స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. ఒడిశా రాష్ట్రం రాయగడ జిల్లాకు చెందిన ఓ వ్యక్తి వీరికి తుపాకీని విక్రయించినట్లు తెలిపారు. అతనిని కూడా త్వరలోనే అరెస్ట్ చేస్తామని చెప్పారు.

ఓటరు మహాశయులకు..
వందనం





- జిల్లాలో ఓటర్ల సంఖ్య 18 లక్షల 80 వేల 65 మంది
- రేపు జాతీయ ఓటరు దినోత్సవం
- బాపూజీ కళామందిర్‌లో సీనియర్ ఓటర్లకు సత్కారం


శ్రీకాకుళం పాతబస్టాండ్: ప్రజాస్వామ్యంలో ఓటర్లే దేవుళ్లు. ఎవరు తమను పాలించాలనే నిర్ణయాధికారం వారిదే. అలాంటి ఓటర్ల ఆవశ్యకతను గుర్తు చేసుకునేందుకు ఏటా జనవరి 25న జాతీయ ఓటర్ల దినోత్సవం నిర్వహిస్తున్నారు. మన జిల్లాకు సంబంధించి శ్రీకాకుళంలోని బాపూజీ కళామందిరంలో ఓటర్ల దినోత్సవం ఘనంగా నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. పలువురు సీనియర్ ఓటర్లను సత్కరించనున్నారు. నూతన ఓటర్లుకు ఎపిక్ కార్డులు అందజేయనున్నారు. రానున్న ఎన్నికల్లో తప్పనిసరిగా ఓటింగ్‌లో పాల్గొనేలా వారిలో చైతన్యం తెచ్చేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఈ ఏడాది 'నథింగ్ లైక్ ఓటింగ్, ఐయాం ఫర్ షూర్' అనే నినాదంతో కార్యక్రమం నిర్వహిస్తున్నారు.

- సవరించిన జాబితా ప్రకారం జిల్లాలో ఎనిమిది శాసనసభా నియోజకవర్గాల్లో కలిపి 1880065 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 931640 మంది పురుషులు కాగా, 948299 మంది మహిళా ఓటర్లు. ఇతరులు 126 మంది ఉన్నారు.
- ఈసారి ప్రత్యేక ఓటర్ల సమ్మరీ కార్యక్రమంలో భాగంగా ఫారం-6, 6ఏలు కలిపి 3805 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో ఫారం-6లు 1751 కాగా, 6ఏలు 2054 వచ్చాయి.
- తొలగింపు కోసం 1166 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో చనిపోయిన వారు 583 మంది, ఒకచోట నుంచి మరొకచోటికి వెళ్లిన వారు 582 మంది, డూప్లికేట్ ఓటరు ఒకరిని తొలగించారు.
- జిల్లాలో ఎన్ఆర్ఐ ఓటర్లు 80 మంది ఉన్నారు. ఇచ్ఛాపురంలో 11 మంది, పలాసలో ఒకరు, టెక్కలిలో 17 మంది, పాతపట్నంలో 9 మంది, శ్రీకాకుళంలో 29మంది, ఆమదాలవలసలో నలుగురు, ఎచ్చెర్లలో ఆరుగురు నరసన్నపేటలో ముగ్గురు చొప్పున ఉన్నారు.
- దివ్యాంగ ఓటర్లు 21534 మంది ఉన్నారు. వీరికి ఓటింగ్ కౌంటర్ వద్ద ప్రత్యేక వసతులు కల్పించాల్సి ఉంటుంది.
- నూతన ఓటర్లు (18–19 ఏళ్ల వారు) 19315 మంది ఉన్నారు. ఇచ్ఛాపురంలో 2459 మంది, పలాసలో 2301 మంది, టెక్కలిలో 2606 మంది, పాతపట్నంలో 1952 మంది, శ్రీకాకుళంలో 2661 మంది, ఆమదాలవలసలో 2105 మంది, ఎచ్చెర్లలో 2884 మంది, నరసన్నపేటలో 2347 మంది ఓటర్లు ఉన్నారు.
- సర్వీసు ఓటర్లు 16,189 మంది ఉన్నారు. ఇచ్ఛాపురంలో 1951 మంది, పలాసలో 2997 మంది, టెక్కలిలో 2870 మంది, పాతపట్నంలో 1804 మంది, శ్రీకాకుళంలో 1246 మంది, ఆమదాలవలసలో 2211 మంది, ఎచ్చెర్లలో 921 మంది, నరసన్నపేటలో 2189 మంది ఉన్నారు.

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
ఇచ్ఛాపురం	131396	138165	17	269578
పలాస	107496	112414	21	219931
టెక్కలి	117978	118694	09	236681
పాతపట్నం	112513	113168	09	225690
శ్రీకాకుళం	135562	138333	29	273924
ఆమదాలవలస	96094	97610	15	193719
ఎచ్చెర్ల	123370	121988	13	245371
నరసన్నపేట	107231	107927	13	215171
మొత్తం	931640	948299	126	1880065

పోయాం..మోసం!

- కూటమి ప్రభుత్వ హయాంలో దగాపడిన నిరుద్యోగులు
- అరసవల్లి ఆలయంలో 48 మంది దినసరి వేతనదారుల నుంచి అక్రమంగా డబ్బుల వసూళ్లు
- రాష్ట్ర కమిషనర్ తాలూకా అంటూ వసూళ్లకు పాల్పడిన ఓ రిటైర్డ్ ఉద్యోగి
- ఇటీవల కమిషనర్‌కు ఇవ్వాలంటూ రూ.3 లక్షల వరకు కలెక్షన్లు
- తీరా కమిషనర్ బదిలీ కావడంతో తీవ్ర ఆందోళనలో దినసరి వేతనదారులు





అప్పటి ఈఓ చంద్రశేఖర్‌కు విన్నవించుకుంటున్న దినసరి వేతనదారులు (ఫైల్)

అరసవల్లి:

గత ప్రభుత్వ హయాంలో ఒక్క రూపాయి కూడా లంచాలివ్వకుండా రాజకీయాలకు అతీతంగా ఉద్యోగాలు పొందిన ఆ నిరుద్యోగులు నేడు ఓ రిటైర్డ్ ఉద్యోగి (గ్రేడ్-1 ఈఓ) పుణ్యమా అని మోసపోయి దిక్కుతోచని దుస్థితిలో ఉన్నారు. ప్రసిద్ధ అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయానికి అవసరానికి తగిన రెగ్యులర్ ఉద్యోగులు లేకపోవడంతో సుమారు 48 మంది నిరుద్యోగులకు దినసరి వేతనదారులుగా గత ప్రభుత్వం అవకాశం ఇచ్చింది. అయితే ఎన్నికల నోటిఫికేషన్ వచ్చినప్పటి నుంచి 11 నెలలుగా వీరికి దినసరి వేతనాలు ఇవ్వడం లేదు. వీరి బాధలను అవకాశంగా తీసుకుని వీరందరినీ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులుగా మార్చేలా ప్రత్యేక ఆర్డర్ కోసం దేవదాయ శాఖ కమిషనరేట్‌లో 'పని' చేయించుకుని వస్తానంటూ ఆలయంలో పనిచేస్తున్న ఓ రిటైర్డ్ ఉద్యోగి బాధితులకు 'ఆర్డర్' ఆశ చూపించి డబ్బులు రూ.లక్షల్లో వసూలు చేశారు.

గతంలోనూ ఆధిపత్య ప్రదర్శన..

కొద్ది నెలల కిందట ఆలయంలో పనిచేసిన ఇద్దరు రెగ్యులర్ ఉద్యోగుల ద్వారా ఇలాగే డబ్బులు వసూలు చేసినట్లుగా సృష్టించి వాళ్లిద్దరిపై సస్పెండ్ వేటు పడేలా అప్పటి ఈఓ చంద్రశేఖర్‌పై ఒత్తిడి తెచ్చి ఆలయం నుంచి పంపించేసేలా తన ఆధిపత్యాన్ని ప్రదర్శించినట్లుగా అప్పట్లో వార్తలొచ్చాయి. మళ్లీ ఇప్పుడు రాష్ట్ర దేవదాయ శాఖ కమిషనర్ పేరు చెప్పి మరోసారి బాధిత దినసరి వేతనదారుల నుంచి తొలి విడతగా రూ.3 లక్షల వరకు వసూళ్లు చేయించి కమిషనర్‌కు ఇవ్వాలంటూ చెప్పి అరసవల్లి కూడలిలో ఉన్న ఓ హోటల్‌లో స్వయంగా అతడే అందజేసినట్లుగా విశ్వసనీయ సమాచారం. అయితే ఇచ్చాడా లేదా అన్న సందేహాలు కూడా బాధితుల్లో వ్యక్తమవుతున్నాయి. తాజాగా జరిగిన బదిలీల్లో దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణకు బదిలీ కావడంతో ఆయన బంధువుగా చలామణి అవుతున్న సదరు రిటైర్డ్ ఉద్యోగి వ్యవహారంపై దినసరి వేతనదారులంతా ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నారు.

కమిషనర్ తాలూకా అంటూ..

జిల్లాకు చెందిన ఎస్.సత్యనారాయణ రాష్ట్ర దేవదాయ శాఖ కమిషనర్‌గా పనిచేసిన సంగతి తెలిసిందే. అయితే అదే సామాజిక వర్గానికి చెందిన ఓ రిటైర్డ్ ఈఓ.. కమిషనర్ తన దగ్గరి బంధువంటూ అరసవల్లి ఆలయంలో కొన్నేళ్లుగా విధులు నిర్వర్తిస్తున్నారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గత ఏడాది సెప్టెంబర్ నుంచి ఈ రిటైర్డ్ ఉద్యోగి జీతం రూ.25 వేలకు ఫిక్స్ చేస్తూ కమిషనరేట్ నుంచి ఆర్డర్ తెప్పించుకున్నారు. కమిషనర్ పేరు చెబుతూనే అటు ఆలయ ఈఓలకు ఇటు ఉద్యోగుల పైన నిత్యం జులుం చెలాయిస్తూ తన దొంగ బిల్లులు ఆమోదమయ్యేలా బెదిరింపులకు పాల్పడుతున్నాడనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇటీవలే వివిధ దేవాలయాల నుంచి అరసవల్లికి ఒక సూపరింటెండెంట్, ఇద్దరు సీనియర్ అసిస్టెంట్లు, ఒక జూనియర్ అసిస్టెంట్ బదిలీపై వచ్చారు. అయినప్పటికీ రిటైర్డ్ ఈఓగా రూ.70 వేల వరకు నెల పింఛన్ పొందుతున్న అతడికి నెలసరి జీతంగా రూ.25 వేలు ఇచ్చి మరీ ఎలా కొనసాగిస్తున్నారన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈయనకు ఇచ్చే నెలసరి వేతనంతో ఓ ముగ్గురు దినసరి వేతనదారుల కింద కంప్యూటర్‌తో కూడిన విధులు నిర్వర్తించే అవకాశముంది. ఇప్పటికైనా ఈ రిటైర్డ్ ఉద్యోగి వ్యవహారాలపై ఉన్నతాధికారులు దృష్టి సారించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

ట్రాన్స్‌ఫర్ అయితే నేనేం చేస్తా..

రిటైర్డ్ ఉద్యోగి వద్ద ఇటీవల కొందరు బాధితులు సమస్యను ప్రస్తావిస్తే 'కమిషనర్ ట్రాన్స్‌ఫర్ అయితే నేనేం చేస్తాను...డబ్బులు మరిచిపోవడమే...' అంటూ దాటవేస్తూ పోయాడని బాధితులు గోడు వెళ్లగక్కుతున్నారు. ఇప్పుడు ఏం చెయ్యాలో తెలియక డైలమాలో పడ్డారు. విజయవాడలో పని చేయిస్తామని చెప్పి ఇప్పటికే రెండుసార్లు మోసపోయిన తమకు స్థానిక నాయకులు న్యాయం చేస్తారేమో అని ఎదురుచూసినప్పటికీ కేంద్ర, రాష్ట్ర మంత్రులు రామ్మోహన్‌నాయుడు, అచ్చెన్నాయుడులు సైతం బాధితులపై ఏమాత్రం కరుణ చూపడం లేదు. దీంతో ఈ రథసప్తమి ఉత్సవానికి ముందే బాధిత దినసరి వేతనదారులంతా రోడ్డెక్కనున్నట్లు సమాచారం.

ఆదిత్యుని ఆలయం

నేడు లేబర్ కోర్టులో విచారణ

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో 34 మంది ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు తొలగింపుపై శ్రీకాకుళం డేఅండ్‌నైట్ జంక్షన్ వద్ద ఉన్న లేబర్ కమిషన్ కార్యాలయంలో శుక్రవారం విచారణ జరగనుంది. డిసెంబర్ 31న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను తొలగించగా, జనవరి 2న వీరంతా లేబర్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. తమకు ముందస్తు సమాచారం ఇవ్వలేదని, 151 జీవో మేరకు కనీసం మూడేళ్లు కొనసాగించాలని, ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీ రెన్యువల్‌కు దరఖాస్తు చేసుకున్నా వర్సిటీ అధికారులు స్పందించలేదని, పాలక మండలిలో సైతం ప్రస్తావన లేకుండా తొలగించారని ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఈ నెల 9న మొదటిసారి విచారణ నిర్వహించారు. లేబర్ కోర్టు అసిస్టెంట్ కమిషనర్ హాజరై ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, ఏజీఎస్ మేనేజ్‌మెంట్ సర్వీసెస్ (గుంటూరు), వర్సిటీ తరఫున అధికారులు కాకుండా కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్‌తో కూడిన సిబ్బంది హాజరయ్యారు. లేబర్ కోర్టు అడిగిన ప్రశ్నలకు సరైన సమాధానాలు సరైన సమాధానం చెప్పకపోవటంతో వర్సిటీ తరఫున సంబంధిత అధికారి హాజరు కావాలని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో శుక్రవారం మరోసారి విచారణ జరగనుంది.

కల్లుగీత కార్మికుల మద్యం షాపులకు నేడు డ్రా

శ్రీకాకుళం క్రైమ్ : నూతన మద్యం పాలసీలో భాగంగా గతేడాది అక్టోబరు 14న జిల్లాలో 158 మద్యం షాపులకు ప్రయివేటు వ్యక్తుల టెండర్లను కోరుతూ ఎక్సైజ్ శాఖ జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో డ్రా నిర్వహించిన సంగతి తెలిసిందే. తాజాగా కల్లుగీత కార్మికులకు 16 మద్యం దుకాణాల కేటాయింపునకు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సమక్షంలో శుక్రవారం డ్రా నిర్వహించనున్నట్లు జిల్లా ఎక్సైజ్ అధికారి సీహెచ్ తిరుపతినాయుడు గురువారం పేర్కొన్నారు. జిల్లా కలెక్టరేట్‌లో దరఖాస్తుదారుల సమక్షంలో ఉదయం 9:30 గంటలకు ప్రక్రియ మొదలు కానుందని చెప్పారు.

చంద్రబాబూ.. ఎస్సీ విభజన జోలికి పోవద్దు

- కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్



మాట్లాడుతున్న చింతా మోహన్

శ్రీకాకుళం అర్బన్: రాష్ట్రంలో ఎస్సీ విభజన జోలికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పోకూడదని, కాదని ముందుకెళ్తే దళితులను, ఓబీసీలను కలుపుకొని పోరాటం చేస్తానని కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ అన్నారు. శ్రీకాకుళంలోని ఓ ప్రైవేటు అతిథి గృహంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్వార్థ రాజకీయాల కోసం ఎస్సీలను వాడుకోవద్దని చంద్రబాబుకు సూచించారు. గాంధీ, నెహ్రూ, ఇందిరా గాంధీ, అంబేడ్కర్ వంటి వారి వల్ల ఎస్సీలకు 15 శాతం, ఎస్టీలకు 7.5 శాతం, రిజర్వేషన్లు వచ్చాయన్నారు. ఎస్సీల వర్గీకరణపై మిశ్రా నేతృత్వంలో వన్‌మ్యాన్ కమిషన్ వేశారని, అతనికి దళితుల స్థితిగతులపై కనీస అవగాహన కూడా లేదన్నారు. చంద్రబాబు ఆలోచనా విధానం తప్పని, ఈ కమిషన్‌ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఏపీ రాష్ట్ర విభజనకు, దళిత విభజనకు చాలా దగ్గర సంబంధం ఉందన్నారు. దళిత విభజన కోసమే రాష్ట్ర విభజన జరిగిందన్నారు. రాష్ట్ర విభజన వల్ల ఏం సాధించారని ప్రశ్నించారు. అమరావతిలో కట్టడాల కోసం హడ్కో సంస్థ నుంచి సీఆర్‌డీఏకు రూ.11వేల కోట్లను 15 ఏళ్ల కాలపరిమితితో 9 శాతం వడ్డీకి అప్పు తెచ్చారని, ప్రతి మూడు నెలలకు వడ్డీ చెల్లించేలా ఒప్పందం చేసుకున్నారని చెప్పారు. అసలు అప్పులు చేసి అమరావతిని నిర్మించాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. విశాఖ ఉక్కు పరిశ్రమ కోసం ఇటీవల కేంద్రం రూ.11,400 కోట్లు కేటాయించిందని, ఈ నిధులు ఏమాత్రం సరిపోవన్నారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు లఖినేని నారాయణరావు, బస్వా షణ్ముఖరావు తదితరులు ఉన్నారు.

కార్గో ఎయిర్‌పోర్టుకు వ్యతిరేకంగా దీక్ష



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న వామపక్ష, ప్రజా సంఘాల నాయకులు

శ్రీకాకుళం పాతబస్టాండ్ : కార్గో ఎయిర్‌పోర్టుకు వ్యతిరేకంగా దశల వారీ పోరాటాలు చేస్తామని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, న్యూ డెమొక్రసీ జిల్లా కార్యదర్శి తాండ్ర ప్రకాష్, సీపీఐ ఎంఎల్ లిబరేషన్ నాయకుడు మద్దిల రామారావు అన్నారు. కార్గో ఎయిర్‌పోర్టుకు బలవంతపు భూసేకరణ ఆపాలని, సముద్ర తీర ప్రాంతాన్ని కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టవద్దని డిమాండ్ చేస్తూ పోరాట కమిటీ, వామపక్షాల ఆధ్వర్యంలో కార్గో ఎయిర్‌పోర్ట్ వ్యతిరేక పోరాట కమిటీ అధ్యక్షుడు కొమర వాసు అధ్యక్షతన జిల్లా కలెక్టరేట్ వద్ద నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల ఆస్తులను కార్పొరేట్ కంపెనీలకు ఎందుకు కట్టబెడుతున్నారో సమాధానం చెప్పాలని కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడును ప్రశ్నించారు. కార్గో ఎయిర్‌పోర్టు పేరిట మందస, వజ్రపుకొత్తూరు మండలాల్లోని 20 గ్రామాల్లో 1400 ఎకరాల భూమిని ప్రజల వద్ద నుంచి బలవంతంగా లాక్కునేందుకు ప్రయత్నిస్తున్నాయని ఆరోపించారు. ఈ చర్యలు మానుకోకపోతే, ప్రజల మద్దతుతో ఉద్యమాలు ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. నిరసన దీక్షలో సీపీఎం నాయకులు బి.కృష్ణమూర్తి, పోరాట కమిటీ నాయకులు లండ రామస్వామి, జోగి అప్పారావు, చిత్త గున్నయ్య, మర్ల సంతోష్, తెప్పల గున్నయ్య, నల్ల పరుశురాం, గుంటు లోకనాథం, డి.సురేష్, డి.దానయ్య, ఎస్.రాజు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.మోహన్ రావు, జి.సింహాచలం, టి.అజయ్‌కుమార్, ప్రజాసంఘాల నాయకులు మామిడి తులసయ్య, మామిడి మాధవరావు, హేమారావు చౌదరి, నల్ల హడ్డి, వంకల మాధవరావు, పి.కుసుమ, కృష్ణవేణి, నీలంరాజు, భాస్కరరావు, డి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

క్రైమ్ కార్నర్

రైలు పట్టాలపై వ్యక్తి మృతదేహం



పూండి వద్ద పట్టాలపై మృతదేహం

వజ్రపుకొత్తూరు: పూండి రైల్వే స్టేషన్ సమీపంలో గురువారం గుర్తు తెలియ వ్యక్తి మృతదేహం రైలుపట్టాలపై కనిపించింది. మృతుడి వయసు 55 నుంచి 60 ఏళ్లు ఉంటుందని, నెరిసిన జుత్తుతో పాటు నలుపుగళ్ల షర్టు, ఆకుపచ్చ లుంగీ ధరించి ఉన్నట్లు జీఆర్‌పీ ఎస్ఐ ఎస్‌కే షరీఫ్ తెలిపారు. పొట్ట భాగం పెద్దగా ఉందని వివరించారు. రైలు కిందపడి చనిపోయాడా, లేక ఇంకేమైనా జరిగిందా తెలియాల్సి ఉందన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పలాస ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. వివరాలు తెలిసినవారు 94406 27567 నంబరుకు సమాచారం అందించాలని కోరారు.

మహిళ ఆత్మహత్య

ఎచ్చెర్ల క్యాంపస్ : చిలకపాలెంలో సప్ప కుమారి(55) అనే మహిళ ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. శ్రీకాకుళం చిన్న బరాటం వీధికి చెందిన ఈమె భర్త మృతి చెందడంతో చిలకపాలెంలో ఉంటున్న తల్లిదండ్రుల వద్దకు వచ్చేసింది. తల్లిదండ్రులు సైతం కొన్నేళ్ల క్రితం మృతి చెందారు. పెద్దకుమారుడు సంతోష్ బెంగళూరులో, చిన్న కుమారుడు రాజేష్ పాతపట్నంలో ఉద్యోగాలు చేస్తున్నారు. రాజేష్ గురువారం సాయంత్రం ఇంటికి చేరుకునే సరికి తల్లికి ఫ్యాన్‌కు వేలాడుతూ విగతజీవిగా కనిపించడంతో వెంటనే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలు కారణంగా మృతి చెందినట్లు పోలీసులు భావిస్తున్నారు. అనారోగ్యం కారణంగానే ఆత్మహత్య చేసుకుంటున్నట్లు నోట్ రాసి మృతి చెందినట్లు సమాచారం. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. కుమారుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తామరాపల్లిలో విషాదం



రాంబాబు (ఫైల్)

నరసన్నపేట: మండలంలోని తామరాపల్లికి చెందిన ఎస్.రాంబాబు (30) గురువారం ఉదయం నాతవలస వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. మ్యాక్సీ వ్యాన్ క్లీనర్‌గా పనిచేస్తున్న రాంబాబు నాతవలస వద్ద దిగి రోడ్డు దాటుతుండగా లారీ ఢీకొట్టడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. సమాచారం తెలుసుకున్న భార్య మహాలక్ష్మి, కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

బావిలో యువకుడి మృతదేహం



యువకుడి మృతదేహం

బూర్జ: మండలంలోని మదనాపురం గ్రామానికి కూతవేటు దూరంలో పాలకొండ–శ్రీకాకుళం ప్రధాన రహదారి పక్కన మంచినీటి బావిలో గుర్తు తెలియని యువకుడి మృతదేహాన్ని గురువారం స్థానికులు గుర్తించారు. వీఆర్వో లక్ష్మీనారాయణ సమాచారం మేరకు పోలీసులు వెళ్లి పరిశీలించి పాలకొండ అగ్నిమాపక సిబ్బందికి తెలియజేశారు. వారు మృతదేహాన్ని బయటకు తీశారు. ఎస్సై ఎం.ప్రవళిక కేసు నమోదు చేశారు. మృతుడు కొంతకాలంగా మతిస్థిమితం లేకుండా చుట్టు పక్కల గ్రామాల్లో సంచరించేవాడని, దాహం తీర్చుకోవడానికి వచ్చి బావిలో పడిపోయి ఉంటాడని భావిస్తున్నారు. వివరాలు తెలిసిన వారు 63099 90855 నంబరుకు తెలియజేయవచ్చని ఎస్ఐ పేర్కొన్నారు.

మద్యం మత్తులో వ్యక్తి ఆత్మహత్య

సారవకోట: మండలంలోని మాళువ గ్రామానికి చెందిన విష్ణు దాలయ్య(55) గురువారం మద్యం మత్తులో పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. దాలయ్య మద్యం సేవించి ఇంటికి రావడంతో కుటుంబసభ్యులు నిలదీశారు. దీంతో ఇంట్లో కూరగాయలు పండించేందుకు వినియోగించే పురుగు మందు తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి పాతపట్నం సీహెచ్‌సీ తరలించారు. పరిస్థితి విషమించడంతో శ్రీకాకుళం సర్వజన ఆస్పత్రిలో చేర్పించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. దాలయ్య భార్య పద్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ అనిల్‌కుమార్ కేసు నమోదు చేశారు. దాలయ్యకు కుమారుడు హేమసుందరరావు, కుమార్తె ఉష ఉన్నారు.

బైక్‌పైకి దూసుకొచ్చిన ఆర్టీసీ బస్సు



గాయపడిన రెల్ల వసంత్

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీలోని కేటీ రోడ్డులో గురువారం రాత్రి ఆర్టీసీ బస్సు ద్విచక్ర వాహనచోదకుడి పైకి దూసుకెళ్లింది. పలాస డిపో పల్లెవెలుగు బస్సు (ఏపీ30జెడ్ 0044) గొప్పిలి నుంచి పలాస వస్తుండగా విద్యుత్ ఈఆర్ఓ కార్యాలయం అదుపు తప్పడంతో ఈ ఘటన చోటుచేసుకుంది. గాయపడిన వ్యక్తి మొగిలిపాడుకు చెందిన ఆధ్యాత్మికవేత్త రెల్ల వసంత్‌గా గుర్తించారు. ఎడమకాలుపై టైరు వెళ్లడంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే 108 సిబ్బంది తారకేశ్వరరావు, వెంకటరావులు ప్రథమ చికిత్స అందించి పలాస ప్రభుత్వ సామాజిక ఆస్పత్రికి తరలించారు. పాత బస్సు కావడంతో కంట్రోల్ కాలేదని సమాచారం.